డిసెంబరులో జేఎన్‌టీయూ 15వ స్నాతకోత్సవం

హైదరాబాద్ సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ 15వ స్నాతకోత్సవాన్ని డిసెంబరులో నిర్వహించాలని వర్సిటీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. వైస్‌చాన్స్‌లర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎ.జయలక్ష్మి బుధవారం నోటిఫికేషన్ జారీచేశారు. ఈ క్రమంలో యూనివర్సిటీ అనుబంధ, అఫిలియేటెడ్ కళాశాలల్లో అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ డిగ్రీల (ఓడీ)కోసం ఈ నెలాఖరు (నవంబరు 30లోగా) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓడీలు పొందేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 16నుంచి యూనివర్సిటీ స్టూడెంట్ సర్వీస్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. స్నాతకోత్సవ వేదికపై పీహెచ్‌డీ పట్టాలు, బంగారు పతకాలను అందుకునేందుకు అర్హులైన వారి పేర్లతో జాబితాలను నవంబరు 25లోగా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే 9491293735/8008103825 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు. ఈ వార్షికోత్సవంలో లక్షమంది విద్యార్థులకు ఒరిజనల్ డిగ్రీలను జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని యూనివర్సిటీ పరీక్షల విభాగం డైరెక్టర్ జి.కృష్ణమోహనరావు తెలిపారు.